

'సింగభూపాలెం' చేపల్లేవ్..
మృగశిర కార్తె సందర్భంగా చేపల కోసం పలువురు సింగభూపాలెం చెరువు వద్దకు వెళ్లగా వారికి నిరాశే ఎదురైంది. 8లో



సుదీర్ఘ గానలహరి..
స్వర మధురిమ కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో సుదీర్ఘ గానలహరి ప్రారంభమైంది. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
34° / 25°
జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం తర్వాత జల్లులు పడే అవకాశం ఉంది. రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్య సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



రామాలయంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, కుటుంబసభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్ర స్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి మల్లికార్జునరావు శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత ఆయనకు దేవస్థాన ప్రధాన అర్చకులు ఆలయ సంప్రదాయ ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకున్న మల్లికార్జున్‌రావు ప్రత్యేక పూజలు చేయగా, అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. భద్రాచలం ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్లు, ఆలయ ఉద్యోగి సాయిబాబు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్ -1 పరీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): నేడు జరిగే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 21 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 8,875 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వివరించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 9 గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని, 10 గంటలకు గేట్లు మూసివేస్తామని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎల్రక్టానిక్ వస్తువులను కేంద్రాల్లోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ: విద్యార్థులు చదువుకుంటూనే క్రీడల్లో సైతం రాణించాలని పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు సూచించారు. కేటీపీఎస్ కాలనీలోని బాస్కెట్‌బాల్ మైదానంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడాశిక్షణ శిబిరం శుక్రవారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సీఈ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. వేసవి సెలవుల్లో 50 రోజుల పాటు ఇచ్చిన శిక్షణకు 120 మంది బాలబాలికలు హాజరుకావడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ వీరస్వామి, వైటీఎంకే రాజు, బాస్కెట్‌బాల్ క్లబ్ సభ్యులు హిమవరుణ్, అనిల్, రాజీవ్, విక్రాంత్, ప్రణీత్, సలీమ్, కోచ్‌లు శ్రీనివాస్, ఉప్పుశెట్టి రాకేశ్, ముహ్మద్ మునీరుద్దీన్, కె.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

మధిర: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం మధిరలో పర్యటించనున్నారు. ఈమేరకు ఆయన తొలుత మధిరలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం మధిరలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మున్సిపాలిటీ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తారు. అతర్వాత మరికొన్ని కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి పాల్గొంటారు.

మేలైన విత్తనాలే ఎంచుకోండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): వానాకాలం పంటల సాగులో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని, మేలైన విత్తనాలనే సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు సూచించారు. పత్తి విత్తనాలు వేయడానికి నల్లరేగడి నేలలే అనుకూలంగా ఉంటాయని చెప్పారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి రైతులు భారీ సంఖ్యలో ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఏ సమయంలో ఏయే పంటలు సాగు చేయాలి, ఎలాంటి విత్తనాలు ఎంచుకోవాలి, విత్తనాలు నాటే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ విత్తనాల బారి నుంచి ఎలా బయటపడాలి వంటి సందేహాలకు డీఏఓ బాబూరావు వివరంగా సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏడీఏ లాల్‌చంద్, టెక్నికల్ ఏఓలు సాయినారాయణ, అరుణ్‌బాబు, అశోక్, దీపక్ పాల్గొన్నారు.

సాక్షి ఫోన్ ఇన్





ఫోన్ ఇన్‌లో టెక్నికల్ ఏడీఏ, ఏఓలు (ఇన్‌సెట్) రైతుల సందేహాలకు సమాధానం ఇస్తున్న డీఏఓ బాబూరావు

పత్తికి నల్లరేగడి నేలలే అనుకూలం
- ఎర్రనేలల్లో కంది, నువ్వుల పంటల సాగు మేలు
- వానాకాలం వరి సాగులో జాగ్రత్తలు పాటించాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు
- ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకున్న పలువురు రైతులు

● వరిసాగుకు అనుకూలమైన సన్నరకం విత్తనాలు ఏవి.. వరికి ప్రభుత్వం ఏమైనా బోనస్ ప్రకటించిందా..?
– ఆవుల రవి, మల్లెలమడుగు(అశ్వాపురం)

జవాబు: వానాకాలం వరి సాగుకు బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048, సిద్ధ డబ్ల్యూజీఎల్ – 14, హెచ్‌ఎంటీ సోనా వంటి రకాలు అనుకూలం. ఇక సన్న రకం ధాన్యానికి బోనస్ పై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు.

● వానాకాలం సాగుకు మూడు నెలల్లో దిగుబడి వచ్చే వరి రకాలేవి ?
– కారం రవి, నేలమడుగు(టేకులపల్లి)

జ: వానాకాలంలో ప్రత్యూమ్న, వరాలు వంటి రకాలు సాగు చేస్తే మూడు నెలల్లోనే పంట దిగుబడి వస్తుంది. ఆ విత్తనాలు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి.

● మిర్చిలో నారుమడి యాజమాన్యం, అనుకూలమైన సమయం ఏంటి ?
– ఎ. శ్రీనివాసరావు, చింతోనిచెలక(టేకులపల్లి)

జ: మిరపలో ఎత్తయిన, మురుగునీరు బయటకు వెళ్లేందుకు అనుకూలంగా నారుమడి తయారుచేయాలి. విత్తనాలను శుద్ధి చేశాకే నారు పోయాలి. బాగా మాగిన 50 కేజీల పశువుల ఎరువులో 2 కేజీల యూరియా, కేజీ డీఏపీ, కేజీ ఎంఓపీ కలిపి నారుమడిలో పోస్తే మొలకశాతం అధికంగా రావడంతో పాటు ఏపుగా పెరుగుతాయి. చీడపీడలు ఆశించవు.

● ఆయిపామ్‌లో సబ్సిడీ వివరాలు తెలపగలరు?
– మద్దుల వెంకటేశ్వరరావు, ఆళ్లపల్లి

జ: ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలో ఎక్కువ మంది రైతులు ఆయిల్‌పామ్ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఒక్కో మొక్కకు ప్రభుత్వం, ఉద్యాన శాఖల నుంచి రూ.40 సబ్సిడీ ఇస్తున్నారు. మీ సమీపంలోని ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారులను సంప్రదించండి.

● వరి సాగుకు ముందు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి.. పచ్చిరొట్ట ఎరువులతో ఏం లాభం ?
– బోడ వీరన్న, అంజనాపురం(బూర్గంపాడు)
– కుంజా సతీష్, ఎలుకలగూడెం(అశ్వాపురం)
– బొమ్మనబోయిన నాగరాజు, పుల్లాయిగూడెం(పాల్వంచ)
– పర్శిక రవీందర్, కొడవటంచ(గుండాల)
– కుర్సం రాంబాబు, సుబ్బంపేట(చర్ల)
– బోడ కేశవరావు, సుజాతనగర్

జ: వానాకాలంలో వరి సాగుకు ముందే జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పంటలు వేసి 40 రోజుల తర్వాత పూత సమయంలో భూమిలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. సేంద్రియ కర్బన శాతం, నీటిని నిలుపుకునే సాంద్రత పెరుగుతుంది. రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గుతుంది. పంటలకు కావాల్సిన పోషక పదార్థాలు భారీగా లభిస్తాయి. తద్వారా ధాన్యం దిగుబడి పెరుగుతుంది. పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 65 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

● పత్తి విత్తనాలకు అనుకూల సమయం ఏది?
– పర్శిక రవీందర్, కొడవటంచ(గుండాల)
– బోడ అజయ్, గట్టుమళ్ల(లక్ష్మీదేవిపల్లి)
– గారేటి జంపన్న, గొందిగూడెం(అశ్వాపురం)

● నల్లరేగడి, ఎర్ర నేలల్లో ఎలాంటి పత్తి విత్తనాలు అనుకూలం?
– బూర్గ సంజీవరావు, అల్లిగూడెం(అశ్వాపురం)
– భాస్కరరావు మామిడిగూడెం(ఇల్లెందు)

జ: నల్లరేగడి నేలలు పత్తికి అనుకూలంగా ఉంటాయి. రాశి సీడ్, మైకో సీడ్, తులసీ సీడ్ వంటి ఇతర చాలా కంపెనీలు బీజీ – 2 పత్తి విత్తనాలు తయారు చేస్తున్నాయి. మీ నేలను పరీక్షించుకుని అనుకూలమైన రకాలు ఎంపిక చేసుకోవచ్చు. ఎర్రచెలక నేలల్లో కందులు, నువ్వుల పంటలు వేసుకుంటే మంచి దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయి. కందిలో ఎల్‌ఆర్‌జీ 51, డబ్ల్యూఆర్‌జీ 97 వంటి రకాలు అందుబాటులో ఉన్నాయి.

– సీహెచ్. వెంకటేశ్వర్లు, పునుకుల(పాల్వంచ)

జ: 50 – 60 మి.మీ.వర్షపాతం నమోదయ్యాకే పత్తి విత్తనాలు వేయాలి. పొడిదుక్కుల్లో విత్తనాలు వేయొద్దు. నల్లరేగడి నేలలో వరుసకు వరుసకు మధ్య 90 గీ 90 సెం.మీ., ఎర్రనేలల్లో 90 గీ 60 సెం.మీ. దూరంగా వేస్తే మంచి దిగుబడి వస్తుంది. భాస్వరానికి సంబంధించిన డీఏపీ లేదా ఎస్ఎస్‌పీ ఎరువులు దుక్కిలో వేస్తే మంచిది. ఎకరాకు 84 కేజీల యూరియా, 52 కేజీల డీఏపీ, 40 కేజీల ఎంఓపీ అందేలా చర్యలు తీసుకోవాలి.

● వరి నారు పోసేందుకు అనుకూల సమయం ఏది.. నాటు ఎలా వేయాలి.. సన్న, ముతక రకాలు ఏంటి ?
– లక్ష్మణ్ నాయక్, కోడిపుంజులవాగు(పాల్వంచ)

జ: సన్న రకాలలో బీపీటీ 52011, ఆర్‌ఎన్‌ఆర్ 150118, సిద్ధి డబ్ల్యూజీఎల్ 14, హెచ్‌ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్ 962 వంటివి, ముతక రకాల్లో ఎంటీయూ 1010, కేఎన్‌ఎం 118, మతుకమ్మ వంటివి అందుబాటులో ఉన్నాయి. 150 – 160 రోజుల పంట అయితే ఈనెల 20 వరకు సాగుచేసుకోవచ్చు. ఒకటి రెండు రోజుల్లో నారు పోసుకోవాలి. చదరపు మీటర్‌కు 33 కుదుర్లు ఉండేలా చూసుకోవాలి. 130 – 135 రోజుల పంటయితే జూలై 10 లోపు నారుపోసి 25 – 30 రోజుల తర్వాత నాటేయాలి. చ.మీ.కు 44 కుదుర్లు ఉండేలా చూడాలి. 120 – 125 రోజుల పంటకు జూలై చివరి వరకు నారుపోసుకుని 20 – 25 రోజులకు నాటేయాలి. చ.మీ.కు 55 కుదుర్లు ఉండేలా చూడాలి.

● భూసార పరీక్ష ఎక్కడ, ఎలా చేసుకోవాలి? పొలం ఊట పడుతోంది.. చౌడు నివారణ ఎలా?
– కణితి మహేందర్, పాయం భద్రయ్య, కుమ్మరిగూడెం(అశ్వాపురం)

జ: జిల్లాలో రెండు భూసార పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. మీ ఏఈఓను సంప్రదిస్తే మట్టి నమూనా సేకరిస్తారు. చౌడు పొలంలో చిన్న చిన్న మడులు చేసి 24 నుంచి 48 గంటలు మడుల్లో నీరు నిల్వ ఉంచి మురుగునీటి కాలువ ద్వారా తీసేయాలి. అలా రెండు, మూడు సార్లు చేసి పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు, జింక్, జిప్సమ్ వంటి ఎరువులు వేసి కలియదున్నితే చౌడు విరుగుతుంది. చౌడు భూముల్లో చౌడును తట్టుకునే రకాలు ఎంచుకోవాలి. వివరాలకు ఏఓ, ఏఈఓలను సంప్రదించండి.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

నిత్యకల్యాణంలో పాల్గొన్న 86 జంటలు



స్వామివారి నిత్యకల్యాణ వేడుకకు హాజరైన భక్తులు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. అక్కడ మొదట విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారి నిత్యకల్యాణ వేడుకలో 86 జంటలు పాల్గొన్నాయి. వేసవి సెలవులకు తోడు రెండో శనివారం సెలవు దినం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఊరట లభించేనా..

- బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల
- అర్హులైన ఉపాధ్యాయుల్లో హర్షాతిరేకాలు
- సీనియారిటీ, ఖాళీలపై కొనసాగుతున్న కసరత్తు
- జిల్లాలో 814 టీచర్ పోస్టుల ఖాళీలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు షెడ్యూల్ విడుదల కావడంతో డీఈఓ కార్యాలయ సిబ్బంది ఆ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. గతేడాది బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ మధ్యలో నిలిచిపోవడంతో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు నిరాశకు గురయ్యారు. అయితే ఎట్టకేలకు ప్రభుత్వ ప్రకటన, షెడ్యూల్ విడుదల కావడంతో వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలోని ఉపాధ్యాయుల సీనియారిటీ, ఖాళీల సంఖ్యను శనివారమే వెల్లడించాల్సి ఉండగా ఆ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. ఆదివారం వెల్లడిస్తామని, ఈనెల 29 నాటికి ప్రక్రియ పూర్తి చేస్తామని డీఈఓ తెలిపారు. ఆ తర్వాత జిల్లాలో కొన్ని ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం ఉండగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరింత నాణ్యమైన బోధన అందుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

ఫలితాలపై ప్రభావం..

ప్రతీ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాక ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాలలకు డిప్యుటేషన్లపై కొందరు టీచర్లను పంపిస్తుంటారు. అయితే వివిధ యూనియన్ల నాయకుల ప్రమేయంతో బదిలీలు కొంతమేర నిలిచిపోతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డిప్యుటేషన్ పొందిన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లకపోవడంతో అక్కడి విద్యార్థులు నష్టపోతున్నారు. తద్వారా ఫలితాలపై ప్రభావం చూపుతోంది. అయితే జిల్లాలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయడం, విద్యావలంటీర్లను నియమించడం ద్వారా ఈ సమస్య పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. తద్వారా పిల్లల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని అంటున్నారు.

ఖాళీల వివరాలిలా..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంది. గతేడాది లెక్కల ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 4,357 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా, ప్రస్తుతం 3,544 మంది మాత్రమే పని చేస్తున్నారు. మరో 814 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో 271 ఎస్‌జీటీలు, 136 ఎస్ఏ(సోషల్), 77 ఎస్ఏ(మ్యాథ్స్) పోస్టులు ఖాళీలున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం సీనియారిటీ జాబితా, ఖాళీల సంఖ్యను వెల్లడించడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది కసరత్తు చేస్తున్నారు.

సీనియారిటీ జాబితా తయారు చేస్తున్నాం



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా తయారు చేస్తున్నాం. సీనియారిటీ, ఖాళీల సంఖ్యను ఆదివారం వెల్లడిస్తాం. ప్రభుత్వం విడుదల చేసిన బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ

చేనేత కార్మికులకు చేతినిండా పని

- టెస్కో ద్వారా ఇప్పటికే రూ.255 కోట్ల విలువైన ఆర్డర్లు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



చేనేత సహకార సంఘాల నాయకులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: చేనేత కార్మికులకు తమ ప్రభుత్వం చేతినిండా పని కల్పిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, చేనేత సహకార సంఘాల నాయకులు మంత్రిని శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చేనేత సంఘాల్లోని వస్త్ర నిల్వలు కొనుగోలు చేయడమే కాక బకాయిలు చెల్లించాలని వారు కోరారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోలేదని, తాము మాత్రం కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధి చేకూర్చే పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏడాది పొడవునా చేతినిండా పని కల్పిస్తున్నామని, ప్రభుత్వ శాఖలు ప్రైవేట్ మార్కెట్‌లో కాకుండా టెస్కో ద్వారానే వస్త్రాల కొనుగోలుకు జీఓ ఇచ్చామని చెప్పారు. ఇప్పటికే రూ.255కోట్ల విలువైన ఆర్డర్లు టెస్కో ద్వారా చేనేత సంఘాలకు ఇచ్చామని తెలిపారు. అలాగే, గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను సీఎం దృష్టికి తీసుకెళ్లి చెల్లింపునకు కృషి చేస్తానని చెప్పారు. అయితే, 10 శాతం యార్న్ సబ్సిడీ పథకాన్ని గత ప్రభుత్వం కేబినెట్ ఆమోదం లేకుండా ప్రవేశపెట్టడంతో నిధుల విడుదల కాకపోయినా రూ.33.23కోట్లు టెస్కో నుండి విడుదల చేశామని మంత్రి గుర్తు చేశారు. ఇక త్వరలోనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన

- జిల్లా వ్యాప్తంగా 5,454 కేసుల పరిష్కారం
- కొత్తగూడెంలో అత్యధికంగా 3,379 కేసులు..
- రాజీమార్గమే మేలన్న జిల్లా జడ్జి పాటిల్‌వసంత్



కొత్తగూడెం కోర్టులో కేసులు పరిశీలిస్తున్న జిల్లా జడ్జి పాటిల్‌వసంత్



కక్షిదారులకు పులిహోర పంపిణీ చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి

కొత్తగూడెంటౌన్: జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 5,454 కేసులు పరిష్కారం కాగా.. అత్యధికంగా కొత్తగూడెంలో 3,379 కేసులకు పరిష్కారం లభించింది. కొత్తగూడెం కోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌వసంత్ మాట్లాడుతూ.. రాజీమార్గమే రాజ మార్గమని, సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. లోక్ అదాలత్‌ల ద్వారా జిల్లాలో 5,454 కేసులు పరిష్కారమయ్యాయని, వాటిలో క్రిమినల్ కేసులు 5,271, పీఎల్‌సీ 165, సివిల్ కేసులు 18 ఉన్నాయని వివరించారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకుంటే సమయంతో పాటు డబ్బు ఆదా చేసుకోవచ్చని అన్నారు.

కొత్తగూడెంలో 3,379 కేసులు..

కొత్తగూడెంలో సివిల్, మోటార్ ప్రమాదాలకు సంబంధించిన 12 కేసుల్లో బాధితులకు రూ.22.45 లక్షల పరిహారం అందజేశారు. ఈ కోర్టులో మొత్తంగా క్రిమినల్ కేసులు 3,362, సివిల్ కేసులు 17 పరిష్కారం అయ్యాయి. అత్యల్పంగా మణుగూరులో 379 కేసులు మాత్రమే పరిష్కారం అయ్యాయి. కాగా, లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, మెజిస్ట్రేట్‌లు బి.రామారావు, సాయిశ్రీ, శివనాయక్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, న్యాయవాదులు, బ్యాంక్ మేనేజర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇన్‌ఫార్మర్ నెపంతో వ్యక్తి హత్య

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ వ్యక్తిని హతమార్చారు. నారాయణపూర్ జిల్లా ధనోరా పోలీస్ స్టేషన్ పరిధి తిమ్రి గ్రామంలో ఓ వివాహానికి శనివారం వెళ్లి వస్తున్న దినేశ్ (32)ను మార్గమధ్యలో మావోయిస్టులు అడ్డగించారు. అక్కడే ఆయన్ను గొడ్డళ్లు, కత్తులతో దారుణంగా నరికి హతమార్చారు. ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న ధనోరా పోలీసులు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఆ ప్రాంతంలో భారీగా బలగాలతో కూంబింగ్ చేపడుతున్నట్లు ఎస్పీ ప్రభాత్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి మృతి

పాల్వంచరూరల్ : బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థి గతనెల 9న పురుగుమందు తాగగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం రామాటాకీస్ ఏరియాకు చెందిన కుచెన వంశీ(27) పాల్వంచలోని కాంట్రాక్ట్ కాలనీలో నివాసం ఉంటూ బీటెక్ చదువుతున్నాడు. కొంతకాలంగా మద్యానికి అలవాటు పడి కళాశాలకు వెళ్లకుండా ఉండడంతో తల్లి సునిత మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన వంశీ మే 9న పురుగు మందు తాగి వాంతులు చేసుకుంటుండగా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తీసుకెళ్లారు. కాగా, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి మేనమామ మామిడాల మల్లికార్జున్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ రాము తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..


రాజేష్ (ఫైల్)

ఇల్లందు: ఇల్లెందు మూడో వార్డుకు చెందిన కటకం రాజేష్(45) శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు విపరీతంగా కడుపు నొప్పి రావడంతో కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూనే మృతి చెందాడు. కాగా, రాజేష్‌కు భార్య ఓ కుమార్తె ఉన్నారు. అయితే, ఆయన తల్లి కళావతి, తండ్రి లక్ష్మీనారాయణ గడిచిన రెండు నెలల వ్యవధిలో మృతి చెందగా, ఇప్పుడు రాజేష్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

ఖమ్మం అర్బన్: రెండు ఇళ్ల మధ్య పొత్తుగా ఉన్న పిట్ట గోడ కూలడంతో గాయపడిన వ్యక్తి చికిత్స మృతి చెందాడు. ఖమ్మంకు చెందిన చింతల అంజయ్య(63) ఇంటి సమీపాన నర్సింహరావు, వెంకటేశ్వర్లు పొత్తులో పిట్టగోడ ఉంది. ఈనెల 5న ఆ గోడ కూలడంతో అంజయ్య తీవ్రంగా గాయపడ్డాడని, హైదరాబాద్‌లో చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు ఆయన భార్య భూలక్ష్మి శనివారం ఖానాపురం హవేలీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఘటనపై విచారణ జరిపించాలని ఆమె కోరింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

'సింగభూపాలెం' చేపలు లేవు..

- మృగశిర కార్తెకు అందని వైనం..
- సైజు పెరగకపోవడమే కారణమంటున్న మత్స్యకారులు
- గతంలోనే 'సాక్షి' వెల్లడించినప్పటికీ కొట్టిపారేసిన అధికారులు

సుజాతనగర్: మృగశిర కార్తె రోజున చేపలు తినడం వల్ల ఆరోగ్యానికి మంచిదనే అభిప్రాయం ఉండటంతో ప్రజలు చేపలు తినేందుకు ఆసక్తి చూపుతారు. మృగశిర కార్తె శనివారం వచ్చిన నేపథ్యంలో జిల్లా ప్రజలతో పాటుగా, సుజాతనగర్ మండల ప్రజలకు సింగభూపాలెం చెరువు చేపలు తినే భాగ్యం మాత్రం దక్కలేదు. మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా చెరువలో చేపలు పడతారని అందరూ భావించినా మత్స్యకారులు చేపలు పట్టకపోవడంతో చివరకు నిరాశే మిగిలింది. ఇతర ప్రాంతాలకు చెందిన చేపలను తెచ్చి మండల కేంద్రంలో విక్రయించడంతో రూ.40 నుంచి రూ.70 అదనంగా చెల్లించి మరీ చేపలు కొనాల్సిన పరిస్థితి నెలకొంది.

సైజు పెరగలేదా?

ఏటా సింగభూపాలెం చెరువులో ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీతో 7.41 లక్షల చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా సుమారు 10 నెలల కిందట 80 నుంచి 100 ఎమ్‌ఎమ్ సైజు కలిగిన చేప పిల్లలను చెరువులో వదిలారు. అయితే ప్రభుత్వం ఇచ్చే చేపపిల్లలు నాణ్యమైనవి కావని, అనుకున్నంత సైజు పెరగలేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన చేపపిల్లలు కాకుండా మత్స్యకారులు సొంతంగా 100 నుంచి 150 ఎమ్‌ఎమ్ సైజులో ఉన్న మరో లక్షన్నర చేపపిల్లలను చెరువులో వదిలారు. అయితే తాము సొంతంగా వేసిన చేపలు 800 గ్రాముల నుంచి కిలోలోపు బరువు పెరిగాయని, ప్రభుత్వం ఇచ్చిన చేపలు మాత్రం అరకిలో లోపే ఉన్నాయని మత్స్యకారులు అంటున్నారు.


చేపలు పట్టకపోవడంతో వెలవెలబోతున్న సింగభూపాలెం చెరువు

ఎందుకు పట్టలేదు?

జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన సింగభూపాలెం చెరువు చేపలంటే అందరికీ సుపరిచితమే. ఇక్కడి చేపలు రుచికరంగా ఉండటంతో జిల్లాలోని ఆయా ప్రాంతాల వారు ఇక్కడకు వచ్చి మరీ చేపలు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఈ ఏడాది చేపలు పట్టకపోవడంతో గత నెల 17న 'సాక్షి'లో 'ఈ ఏడాది చెరువులో చేపలు లేనట్టే...' కథనం ప్రచురితమైంది. జిల్లా మత్స్యశాఖాధికారులు 'సాక్షి' కథనంపై కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. చెరువులోని చేపలు 800 గ్రాముల నుంచి 2 కిలోల లోపు ఉన్నాయంటూ నివేదికలో తెలిపారు. అధిక పరిమాణం కలిగిన చేపలను మృగశిర కార్తె నుంచి పడుతామని కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో తెలిపినా శనివారం (మృగశిర రోజున) చేపలు పట్టలేదు. చెరువులోని చేపలు 2 కిలోల బరువుంటే పట్టొచ్చు కదా? అని పలువురు అసహనం వ్యక్తం చేశారు. మత్స్యకారులు మాత్రం చేపల సైజు 200 నుంచి 500 గ్రాముల లోపే అని అంటుండగా.. 800 గ్రాముల నుంచి 2 కిలోల సైజు ఉన్నాయంటూ మత్స్యశాఖాధికారులు అంటున్నారు.


మృగశిర సందర్భంగా చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

అక్కడ వెలవెల.. ఇక్కడ కళకళ

మృగశిర రోజున సింగభూపాలెం చెరువు చేపలను పట్టకపోవడంతో వెలవెలబోయింది. సుజాతనగర్ మండల కేంద్రంలో ఇతర ప్రాంతాలకు చెందిన వారు చేపలను తెచ్చి విక్రయించారు. కిలో చేపలను రూ.170 నుంచి రూ.180 మధ్య విక్రయించారు. చెరువు వద్ద చేపలు పట్టకపోవడంతో అధిక ధర చెల్లించి మరీ చేపలను కొనుగోలు చేశారు.

సుదీర్ఘ 'గానలహరి' ప్రారంభం

తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన గాయకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో స్వర మధురిమ కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యాన రికార్డు నెలకొల్పాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన 32 గంటల సుదీర్ఘ గానలహరి శనివారం ప్రారంభమైంది. వివిధ కళా సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, గాయకులు, ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకాగా, తొలుత ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్రపటానికి నివాళులర్పించారు. శనివారం ఉదయం 10గంటలకు మొదలైన కార్యక్రమం ఆదివారం సాయంత్రం వరకు నిర్విరామంగా కొనసాగుతుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన గాయనీ గాయకులే కాక ఇప్పటికే రికార్డులు నమోదుచేసిన బింగి నరేందర్‌గౌడ్, డాక్టర్ నాగశ్రీ, యడ్ల శ్రీనివాసరావు సైతం పాటలు ఆలపిస్తున్నారు. ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, సాయిశ్రీ డెవలపర్స్ ఎండీ కమర్తపు శ్రీధర్, అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ కార్యదర్శి ఏ.సుబ్రమణ్యకుమార్, గాయకులు పంజా మాలతీనాయుడు, వీవీ.రెడ్డి, స్వర మధురిమ కల్చరల్ అధ్యక్షుడు ఇసనపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



పాట పాడుతున్న గాయకులు


గానలహరి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళా సంస్థల ప్రతినిధులు

దొంగల ముఠా అరెస్ట్

- మూడు ఆటోలు, కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ కరుణాకర్

కొత్తగూడెంటౌన్: కారులో తిరుగుతూ ఇళ్ల ఎదుట నిలిపి ఉంచిన కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలను అపహరిస్తున్న దొంగల ముఠాను కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచల్లో వరుస చోరీలకు పాల్పడిన వ్యక్తుల వద్ద నుంచి మూడు ఆటోలు, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. వీఎం బంజర్, పెనుబల్లి మండలం లింగగూడెంనకు చెందిన గోపి, శ్రీను 30 ఏళ్ల కిందట చుంచుపల్లి మండలం విద్యానగర్‌కాలనీలో స్థిరపడ్డారు. వీరు తమ ప్రాంతానికే చెందిన ముత్తారావు, శివరాం, కోటయ్య, గద్దల శివ, లక్ష్మణ్‌రావుతోపాటు విద్యానగర్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ కిరణ్‌తో కలిసి ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఇంటి ఎదుట నిలిపి ఉంచిన కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలను లక్ష్యంగా చేసుకుని.. భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెంలలో పలు చోరీలకు పాల్పడ్డారు. అలా చోరీచేసిన ఆటోను విక్రయించేందుకు ఆటోతోపాటు కారులో వస్తున్న వీరిని వాహన తనిఖీలు చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు నిందితులు అంగీకరించారని సీఐ కరుణాకర్ తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని ఆయన వివరించారు. ఎస్‌ఐలు రవి, విజయ, సిబ్బంది ఘని, రాజు, ప్రసాద్, రాందాస్, సత్యనారాయణ, సురేశ్ పాల్గొన్నారు.


నిందితులు, ఆటోలను చూపుతున్న పోలీసులు

మృగశిర సంబురానికి ముకుతాడు

కొమరారం గుట్టల చెరువు వద్ద పోలీసుల పహారా

ఇల్లెందురూరల్: మృగశిర కార్తె రోజున చేపలు తింటే మంచిదని అందరూ నమ్ముతారు. కానీ ఈ ఆనవాయితీకి ఇల్లెందు ఏజెన్సీలో మత్స్య శాఖ అధికారుల నిర్ణయం అడ్డుకట్ట వేసింది. మండలంలో సొసైటీలు లేని చెరువుల్లో చేపలు పట్టేందుకు గ్రామపంచాయతీల ద్వారా వేలం నిర్వహించేవారు. తద్వారా జీపీలకు ఆదాయం కూడా సమకూరేది. కానీ మూడేళ్ల క్రితం ఇల్లెందు ఏజెన్సీలోని కొన్ని జీపీల్లో చెరువులకు సొసైటీలు ఏర్పాటుచేయాలని మత్స్యశాఖ నిర్ణయించగా తమకు సమాచారం లేకుండా ఎంపిక చేశారని పోచారం తండా తదితర గ్రామాల ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక మృగశిరకార్తె సందర్భంగా శనివారం మండలంలోని కొమరారం ప్రజలు సమీపంలోని గుట్టల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లగా అప్పటికే చేపల సొసైటీ ప్రతినిధులు మత్స్య శాఖ సహకారంతో పోలీసుల పహారా పెట్టించారు. ఈక్రమంలో ప్రజలను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. ఏటా మాదిరిగా తాము చేపలు పట్టేందుకు వస్తే ఎందుకు అడ్డుకున్నారని నిలదీయగా చెరువును చేపల సొసైటీకి అప్పగించినందున వారి సూచనతో చేపలు పట్టడంపై ఆంక్షలు విధించినట్లు తెలిపారు. చివరకు వచ్చే ఏడాది నుంచి మృగశిర కార్తె తర్వాతే చెరువులో చేప పిల్లలు వదులుతామని సొసైటీ ప్రతినిధులు లేఖ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయమై జిల్లా మత్స్య శాఖాధికారి బానోత్ వీరన్నను వివరణ కోరగా మండలంలోని కొమరారం, పోచారం తండా జీపీల్లో నిబంధనల ప్రకారమే సొసైటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే, కొమరారం గుట్టలచెరువులో సొసైటీ సభ్యులు ముందుగానే చేప పిల్లలు వదిలినందున ప్రజలు దిగకుండా తామే పోలీసుల రక్షణ కోరామని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా పారదర్శకంగా సొసైటీల ఎంపిక చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


గుట్టల చెరువు వద్ద కాపలాగా ఉన్న పోలీసులు

ఆదివాసీలే ఓడించారు...

- సర్వజనుల సామాజిక న్యాయం కోసం మరో పోరాటం చేస్తా
- మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర

కరకగూడెం: ఆదివాసీ సర్వజనుల సామాజిక న్యాయం కోసం త్వరలో మరో పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లంబాడా సామాజిక వర్గాల వారికి టికెట్లు కేటాయించి ఆదివాసీలను మోసం చేశాయని, దీనికి నిరసనగా తాను ఆదివాసీల తరఫున స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో దిగానని పేర్కొన్నారు. అయితే రాజకీయ పార్టీలు లంబాడా తెగల పక్షాన నిలిచి ఆదివాసీలను చీల్చాయని, 11 మంది ఆదివాసీ సంఘాల నాయకులకు డబ్బులిచ్చి పోటీకి నిలిపి తన ఓటమికి కారకులయ్యారని ఆరోపించారు. ఆదివాసీ అభ్యర్థులు రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగి స్వార్థ రాజకీయ లబ్ధి కోసం ఆదివాసీ సమాజాన్ని, ఆత్మ గౌరవాన్ని, ఆదివాసీ సంఘాల జేఏసీ నిర్ణయాన్ని తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గమనించే తాను ఎక్కడా ప్రచారం చేయలేదని తెలిపారు. ఇకనైనా ఆదివాసీ సంఘాలు జాతి ఐక్యత, ఆత్మాభిమానం కోసం పాటుపడాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండలంలోని గొందిగూడెం గ్రామ శివారులో గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గొందిగూడెం గ్రామానికి చెందిన మేకల కాపరి సున్నం సీతారాములు మేకలు కాసుకొని శనివారం సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను స్థానికులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


మృతిచెందిన దుక్కిటెద్దు వద్ద బాధిత రైతు

కరకగూడెం: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతిచెందిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని చొప్పాల గ్రామానికి చెందిన ఏడూళ్ల సమ్మయ్యకు చెందిన దుక్కిటెద్దు రోజువారీగా మేతకు వెళ్లి వస్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి శ్రీరంగాపురం గ్రామ శివారు ఓ రైతు పొలంలో గాలి దుమారానికి తెగిపడిన 11 కేవీ విద్యుత్ తీగలకు తాకి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. దీని విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నారు.

కేసులు నమోదు

ఇల్లెందు: భర్త, అత్త, మామ, ఇతర కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని ఓ వివాహిత శనివారం ఇల్లెందు పోలీసులను ఆశ్రయించింది. పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన మౌనికను.. తన భర్త భాషిత్‌బాబు, అత్త, మామ, ఇతర కుటంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్నుస్తున్నారు. సీఐ కరుణాకర్ విచారించి కేసు నమోదు చేశారు.

సీసీ కెమెరాలు చోరీపై..

సీసీ కెమెరాలనూ చోరీ చేసిన ఘటన ఇల్లెందులో చోటుచేసుకుంది. సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఇబ్రహీంకు పట్టణంలోని 17వ నెంబర్‌బస్తీలోని తన ఇంటికి అమర్చిన రెండు సీసీ కెమెరాలను శుక్రవారం దుండగలు అపహరించారు. ఇబ్రహీం ఫిర్యాదుమేరకు శనివారం సీఐ కరుణాకర్ కేసు నమోదు చేశారు.

వృద్ధుడి మృతిపై..

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామానికి చెందిన సూర్నపాక వీరభద్రయ్య గత నెల 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నాటి నుంచి ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వాకబు చేస్తుండగా గుండాల మండలం వెన్నెలబైలు అటవీ ప్రాంతంలో విగతజీవిగా కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

దుమ్ముగూడెంలో భారీ చోరీ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామానికి చెందిన బైరెడ్డి భానుకిరణ్ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు ఇంట్లోకి ప్రవేశించి రూ.5 లక్షల విలువ గల బంగారం, రూ.40 వేల నగదును అపహరించారు. గ్రామానికి చెందిన భానుకిరణ్ తన భార్యతో కలిసి శుక్రవారం రాత్రి హైదరాబాద్ వెళ్లాడు. ఇంటి తాళాలను తన స్నేహితుడికి ఇచ్చాడు. సదరు స్నేహితుడు శనివారం ఉదయం భానుకిరణ్ ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులకొట్టి తలుపులు తీసి ఉండటం గమనించాడు. వెంటనే మరో స్నేహితుడితో కలిసి ఇంటి వెనుకకు వెళ్లి కిటికీ నుంచి చూడగా బీరువా తెరిచి ఉంది. లోపలికి వెళ్లి వారిద్దరూ భానుకిరణ్‌కు వీడియోకాల్ ద్వారా చూపించారు. చోరీ జరిగినట్లు గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అశోక్ క్లూస్ టీం సభ్యులతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బీరువా తెరిచి వస్తువులను పడేసిన దుండగులు

మిషన్ భగీరథ నీరు వస్తోందా ?!

- ఇంటింటికీ తాగునీటి సరఫరాపై సర్వే
- సమస్యలు, లోపాలపై వివరాల సేకరణ
- రేపటి నుంచి మొదలుకానున్న సర్వే

నేలకొండపల్లి: ఇంటింటికీ తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో దాదాపు 3 లక్షల ఇళ్లకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా దాదాపు అదేసంఖ్యలో ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ఆపై ఇంటింటికీ తాగునీరు సాఫీగా అందుతోందని అధికారులు నివేదిక సమర్పించారు. కానీ క్షేత్ర స్థాయిలో చాలా ఇళ్లకు నీరు అందడం లేదని, పైపులైన్లు పగిలిపోయి, వాల్వ్‌ల వద్ద లీకేజీలతో నీరు వృథా అవుతోందనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యాన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ ఇంటిని సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పది రోజుల్లోగా ఈ సర్వే పూర్తి చేసి మిషన్ భగీరథ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాక కొత్తగా ఏర్పడిన కాలనీల్లో ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చేలా పైపులైన్లు వేసేందుకు కూడా ఇదే సమయాన సర్వే చేస్తారు. ఈ విషయంలో ఇప్పటికే ఉద్యోగులకు శిక్షణ కూడా ఇవ్వగా.. సోమవారం నుంచి రంగంలోకి దిగనున్నారు.

ఏం సేకరిస్తారంటే...

ప్రతీ ఇంటి యాజమాని పేరు, చిరునామా, కుళాయి ఫొటోలను సర్వేలో భాగంగా తీసుకుంటారు. ఆపై యాజమాని పేరు, చిరునామా, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ సహా కుటుంబ సభ్యుల వివరాలు, సరిపడా నీళ్లు వస్తున్నాయా లేదా తదితర 11 రకాల వివరాలు సేకరిస్తారు. వీటన్నంటినీ తొలుత గ్రామ, మండల స్థాయిలో క్రోడీకరించి ఆపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తారు. ఈ వివరాలను పారదర్శకంగా ఉండేలా యాప్‌లోనూ ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు. ఉద్యోగి ఒక్కొక్కరు ప్రతీరోజు 20 నుంచి 30 ఇళ్ల వరకు సర్వే చేయాలని ఉన్నతాధికారులు సూచించారు.

కొత్త కాలనీలకు శుభవార్తే

భగీరథ నీటిపై సర్వే చేయనున్న అధికారులు కొత్త ఇళ్ల విషయంలోనూ స్పష్టత ఇచ్చారు. నూతన నివాసాలకు నంబర్ కేటాయించినా, లేకున్నా సందర్శించి వివరాలను సేకరిస్తారు. ఫలితంగా గ్రామాల వారీగా ఇంకా ఎన్ని ఇళ్లకు నల్లాలు కావాలి, పైప్‌లైన్ వేయాలనే అంశంపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు. దీంతో ఇన్నాళ్లు తాగునీటికి ఇబ్బంది పడుతున్న వారికి మేలు జరగనుంది. ఈ సర్వే సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనుండగా, దాదాపు 3 లక్షల కుటుంబాలను ఉద్యోగులు సందర్శిస్తారు. సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, ఈ పంచాయతీ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది పాల్గొననున్నారు. కాగా, సర్వేలో వెల్లడైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం త్వరలోనే విధివిధానాలను ప్రకటించనుందని తెలుస్తోంది.


తిరుమలాపురంలో మిషన్ భగీరథ నీటి సరఫరా వివరాలు తెలుసుకుంటున్న అధికారులు (ఫైల్)

పది రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక



మిషన్ భగీరథ పథకం నల్లాల ద్వారా నీటి సరఫరా తీరుతెన్నులను తెలుసుకునేందుకు సర్వే చేపట్టనున్నాం. ప్రజలు నీటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారు, ఎక్కడైనా సమస్య ఉందా, ఏదైనా కాలనీలకు నీరు సరఫరా చేయాలనా అనే అంశాలపై పూర్తి వివరాలు సేకరిస్తాం. వీటన్నింటినీ ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి పది రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిస్తాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు


పైపులైన్ మరమ్మతు చేస్తున్న సిబ్బంది

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు స్టేజీ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యాన ప్రజలు ఇచ్చిన సమాచారంతో శనివారం సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. మిషన్‌భగీరథ ఏఈ వసంత్ ఆధ్వర్యాన పనులు చేయగా ఆయన మాట్లాడారు. ఎక్కడ కూడా లీకేజీలతో నీరు వృథా కాకుండా మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు.